క్లుప్తంగా

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ పూజలో పూజారులు, భక్తులు

కడ్తాల్: కడ్తాల్ మండలం మైసిగండి రామాలయంలో కొలువైయున్న శ్రీ కోదండరామచంద్రస్వామి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారభమయ్యాయి. శ్రీకోదండ రామచంద్ర స్వాములవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురువారం మధ్యాహ్నం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత, తహసీల్దార్ జ్యోతి, నిర్వాహకులు భాస్కర్, అరుణ్‌కుమార్ ఆలయ అర్చక సిబ్బంది ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు షురూ



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్: గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం సర్పంచ్ శంకర్‌తో కలిసి ఎంపీపీ భూమిపూజ చేశారు. మండలంలోని గ్రామాలు, తండాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, కార్యదర్శి హరీశ్‌రెడ్డి, వార్డు సభ్యులు నాయకులు కుమార్‌గౌడ్, కేశవులు, జంగయ్య, రామకృష్ణ, శ్రీనునాయక్ ముత్యాలు తదితరులు ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



బీమా ప్రొసీడింగ్ అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం నిరుపేదలకు ఎంతో ధీమా అని మాజీ ఎమ్మెల్సీ ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామానికి చెందిన షేక్ రహీం చెరువులో పడి మరణించాడు. అతడు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా ఉండటంతో అతని పేరిట వచ్చే బీమాకు సంబంధించి భార్య గౌసియాకు రూ.2 లక్షల ప్రమాద బీమా ప్రొసీడింగ్‌ను బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు గోపాల్, శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు .

పట్నంలో ఏబీవీపీ నిరుద్యోగ నిరసన దీక్ష



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిరుద్యోగ నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి కారనమైనవారిపై చర్యలు తీసుకోవాలని.. హైకోర్టు సిట్టింగ్ జడ్జితో లీకేజీ వ్యవహారంపై విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు శ్రీరామ్, సాయిచరణ్, సంజీవరెడ్డి, శశిధర్‌రెడ్డి, శివకృష్ణ, సందీప్, జగదీశ్, చందు, వందన, భవాని లు పాల్గొన్నారు.

కంప్యూటర్, ఇంటర్‌నెట్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తుర్కయంజాల్: ఏవీఎన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల బృందం బుధవారం పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లిలో పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, ఇంటర్నెట్ వినియోగం, సెల్‌ఫోన్ వాడకం, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, యోగాపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు గౌడ్, కళాశాల సిబ్బంది శివ కేశవరెడ్డి, సౌమ్య పాల్గొన్నారు.

పరిహారం అందేనా?

- వడగండ్లకు 410 ఎకరాల్లో పంట నష్టం
- పరిహారం కోసం అన్నదాతల ఎదురుచూపు



ఇటీవల బోడకొండలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి, అధికారులు

మంచాల: ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు పంటచేలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయిన విషయం తెలిసిందే. పంట నష్టానికి సంబంధించి ఇప్పటివరకు నష్టపరిహారం అందకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంచాల మండలంలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు 410 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అందులో శ్రీమంతన్‌గూడ 220 ఎకరాలు, చీదేడ్ 15 ఎకరాలు, దాద్‌పల్లి 35 ఎకరాలు, లోయపల్లి 15 ఎకరాలు, బోడకొండ 125 ఎకరాలు చొప్పున వరిపంట చేలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో పాటు ఆర్డీఓ వెంకటాచారి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గీతారెడ్డితో పాటు కింది స్థాయి అధికారులు సైతం గ్రామాల్లో తిరిగి పాడైన పంటలను పరిశీలించారు. అయితే ఇప్పటివరకు ఎకరాకు ఇంత పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేశామని తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పరిహారం అందించాలి



వడగండ్ల వర్షాలకు పంటచేలు దెబ్బతిన్నాయి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని ప్రకటించి వారం రోజులు దాటింది. ఇప్పటివరకు ఎకరాకు ఎంత అని కూడా స్పష్టత లేదు. తక్షణమే పంట నష్టంపై స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు త్వరగా పరిహారం అందేలా చూడాలి.

– లచ్చిరాం నాయక్, రైతు, బోడకొండ

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



వడగండ్ల వర్షాలకు గ్రామాల్లో దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాం . పూర్తి స్థాయిలో వివరాలు ఉన్నతాధికారులకు అందజేశాం. ప్రభుత్వం పరిహారంపై స్పష్టత ఇచ్చి నిధులు విడుదల చేస్తే వెంటనే రైతులకు అందించే ఏర్పాట్లు చేస్తాం.

– జ్యోతి శ్రీ, వ్యవసాయాధికారి, మంచాల

రుణాలు చెల్లిస్తేనే కొత్తవారికి రుణాలు

పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బకాయిలు సకాలంలో చెల్లిస్తే పీఏసీఎస్‌ను లాభాల బాటలో నడిపించవచ్చని చైర్మన్ బిట్ల వెంకట్‌రెడ్డి అన్నారు. రాచకొండమైలారం (దండుమైలారం) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోతున్నట్లు తెలిపారు. వాయిదా దాటినా చెల్లించని రుణాలు రూ.3 కోట్లకు పైగా ఉన్నట్లు చెప్పారు.తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే కొత్తవారికి రుణాలను అందజేసే అవకాశం ఉంటుందన్నారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో కొత్త సభ్యులను చేర్చుకుంటామన్నారు. పీఏసీఎస్ ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు అందించామన్నారు. దండుమైలారంలో కొత్తగా గోదాం నిర్మాణాన్ని చేపడుతున్నామని, రాయపోల్‌లో ఎరువుల పంపిణీ కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐసీఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ తంగిరాల, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు కాంటేకార్ ఈశ్వర్, డైరెక్టర్లు అయ్యప్పరెడ్డి, మురళీకృష్ణరావు, గణేశ్, మైసయ్య, యాదగిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీఈఓ ధన్‌రాజ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పీఏసీఎస్‌లు కృషి..

ఇబ్రహీంపట్నం రూరల్: రైతుల సంక్షేమానికి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కృషి చేస్తున్నాయని ఎంపీపటేల్ గూడ పీఏసీఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడ సమీపంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. చైర్మన్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కృషి చేస్తున్నయన్నారు. సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు అందిస్తున్నామన్నారు. రైతులందరూ తీసుకున్న రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదమ్మ, శ్యాంసుందర్‌రెడ్డి, లింగారెడ్డి, యాదమ్మ, చంద్రు, తొట్ల యాదమ్మ, మక్కపల్లి అంజయ్య, శ్రీశైలం, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయం



కస్తూర్బా పాఠశాలలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఎంపీడీఓ శ్రీనివాస్

మంచాల: ఎన్ఎస్ఎస్‌లో భాగంగా సీటీ కళాశాల విద్యార్థులు ఆస్మత్‌పూర్ గ్రామంలో ప్రజ్ఞ వైద్యశాల డైరెక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అదే విధంగా మంచాల మండల కేంద్రంలోని కస్తూర్బా గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో శ్రమదానం చేశారు. మంచాల గ్రామంలో నిరుద్యోగ యువతపై ప్రత్యేక సర్వే కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను చైతన్య పర్చడమే గాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎలా వినియోగించుకోవాలనే అంశాలపై కూడా ప్రజలకు వివరించడం బాగుందన్నారు. మంచాల సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు తిరుపతి, చంద్రకీర్తి, నాగరాజు, జయకాగడ, సుదక్షణ, మీడియా ఇన్‌చార్జిలు చతుర్వేద్, ఈరమ్మ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్: శ్రీరామ నవమిని పురస్కరించుకుని గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆయా ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవాడిపల్లి గ్రామంలోని శ్రీ కోదండ రామచంద్రస్వామి దేవాలయం, గండిచెరువులోని శ్రీ రంగనాథ స్వామి దేవాలయం, అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సీతారామాంజనేయస్వామి దేవాలయం, శ్రీ ద్వారకా షిర్డీ సాయిబాబా ఆలయం, పెద్దఅంబర్‌పేటలోని ఆంజనేయ స్వామి దేవాలయం, కుంట్లూర్‌లోని రామాలయాల్లో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం 52వ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు మేనేజర్ జక్కుల ఐలేష్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి సంఘం పరిధిలోని సభ్యులు, రైతులు సకాలంలో హాజరుకాగలరని మేనేజర్ కోరారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన పెంటయ్య ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. నిర్మాణానికి డబ్బులు లేక మధ్యలోనే నిలిపి వేశాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ట్రస్టు సభ్యులచే బుధవారం ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇటుక, స్టీల్, సిమెంట్, ఇసుక తదితర మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, జ్యోతయ్య, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, వార్డుసభ్యులు దశరథం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసకాలనీకి చెందిన..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీనివాసకాలనీకి చెందిన నిరుపేద మహిళ శాంతమ్మ ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు చేయూతనందించింది. శాంతమ్మ ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను బుధవారం ట్రస్టు ఆధ్వర్యంలో అందించారు. సభ్యులు జగన్, మహేశ్, అంజీ పాల్గొన్నారు.

అన్మాస్‌పల్లిలో కంటివెలుగు శిబిరం

కడ్తాల్: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శంకర్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఎంపీడీఓ రామకృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు కుమార్‌గౌడ్, కేశవులు, శ్రీను, జంగయ్య, రామకృష్ణ, శ్రీరాములు, కార్యదర్శి హరీశ్‌రెడ్డి, వైద్యులు కిరన్‌కుమార్, హెచ్ఈఓ సుధీర్ ఉన్నారు.

ప్రత్యక్ష పద్ధతితో అధిక దిగుబడి

ఆమనగల్లు: వరిపంటలో అధిక దిగుబడుల కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామంలో ప్రత్యక్ష పద్ధతిలో సాగుచేసిన వరిపైరును బుధవారం వ్యవసాయాధికారి అరుణ కుమారి పరిశీలించారు. వరిపంటను మామూలు పద్ధతి కన్నా ప్రత్యక్ష పద్ధతితో సాగుచేయడం వల్ల తక్కువ పెట్టుబడితోపాటు అధిక దిగుబడులు వస్తాయని.. పంట కూడా ముందుగానే చేతికి వస్తుందని వివరించారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండా గ్రామ పంచాయతీలో బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్ కామినేని హాస్పిటల్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు, కామినేని ఆస్పత్రి వైద్యులు డా.అఖిల్ ప్రారంభించారు. 236 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ అమర్‌సింగ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి

ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామాన్ని బుధవారం ఆమె సందర్శించారు. జాబ్ కార్డులున్న ప్రతి కూలీ ఉపాధి పనులకు వచ్చేలా అవగాహన కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పారించాలని, నర్సరీల్లోని మొక్కలను సంరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతున్న అభివృద్ధి పనులు, నిధుల ఖర్చుపై రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నమోదులో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. మార్చి 31 లోపు గ్రామంలో వంద శాతం ఇంటి పన్నులు వసూల్ చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

ఆరోగ్య జీవితానికి క్రీడలు అవసరం

ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడలు ఎంతో ముఖ్యమని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సంఘాయిపల్లి తండాలో ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లకు బుధవారం వరప్రసాద్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన సంఘాయిపల్లి తండా జట్టుకు రూ.12,000, ద్వితీయ స్థానంలో నిలిచిన సంగాయిపల్లి జట్టుకు రూ.6,000 అందజేశారు. వార్డు సభ్యులు శంకర్‌నాయక్, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, నరేందర్‌గౌడ్, భరత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన కల్పించండి

ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి

ఆమనగల్లు: చిరుధాన్యాలను తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆమనగల్లు ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పోషణ పక్వాడా అభియాన్‌లో భాగంగా చిరుధాన్యాలపై గ్రామ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొర్రలు, సజ్జలు, సామలు, అరికలు, జొన్నలు తదితర చిరుధాన్యాల్లో అధికంగా ప్రొటీన్స్, ఫైబర్, విటమిన్స్ ఉంటాయని చెప్పారు. గ్రామాల్లో చిరుధాన్యాలపై అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శబరి, సరళ, పార్వతి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీను, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్‌పర్సన్ స్రవంతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బుధవారం స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ యూసుఫ్ మాట్లాడుతూ.. స్వయం శుభ్రత, స్వయం సంరక్షణను పాటించాలన్నారు. వీధుల్లో చెత్తచెదారం పడేయొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ జంగయ్య, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ప్రణవ్, ఆర్పీలు, మహిళా సంఘాలు పాల్గొన్నాయి.

నూతన పరిశోధనలు చేపట్టాలి

రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర డిజాస్టర్ రెస్పాన్స్ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటుగా ఇతర రంగాల్లోనూ ప్రావీణ్యతను సాధించాలన్నారు. కొత్తకొత్త పరిశోధనలు చేపట్టి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కల్చరల్ ఈవెంట్‌లు, క్రీడలలో అకాడమిక్ టాపర్లుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ... ఫైనల్ ఇయర్ విద్యార్థులు వెయ్యికి పైగా క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లు సాధించడం గర్వంగా ఉందన్నారు. కళాశాల సెక్రెటరీ చింతల రవీంద్రనాథ్‌యాదవ్, వైస్ ప్రెసిడెంట్ మృదయ్ రెడ్డి, కోఆర్డినేటర్ నాజు తదితరులు పాల్గొన్నారు.

నారాయణగౌడ్ సేవలు చిరస్మరణీయం

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్

యాచారం: మాజీ జెడ్పీటీసీ కర్నాటి నారాయణగౌడ్ సేవలు ఎనలేనివని ఆయన కుమారుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్ అన్నారు. మంతన్‌గౌరెల్లి గ్రామంలో బుధవారం నారాయణగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలోని నారాయణగౌడ్ విగ్రహానికి పూలమాలలేసి నివాళులర్పించారు. నారాయణగౌడ్ తన రాజకీయ జీవితంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని అన్నారు. గిరిజనతండాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, వీధి లైట్లు తదితర అభివృద్ధి పనుల చేపట్టారన్నారు. జెడ్పీటీసీగా ఉన్న కాలంలో ఆయన చేపట్టిన పనులు, సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ యాదయ్యగౌడ్, మాజీ సర్పంచ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

150 పడకల హామీ ఏమైంది?

- ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి ఎదుట వైఎస్సార్‌టీపీ నేతల నిరసన
- సీఎం కేసీఆర్ హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్



ప్రభుత్వాస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి స్థాయిని ఎప్పుడు పెంచుతారని వైఎస్సార్‌టీపీ కల్వకుర్తి ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి ప్రశ్నించారు. ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు పూర్తికావస్తున్నాయని ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని వైఎస్సార్‌టీపీ కార్యకర్తలతో కలిసి బుధవారం అర్జున్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచాలని కోరుతూ ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చీమర్ల అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆస్పత్రి భవనమంతా శిథిలావస్థకు చేరుకుందని, ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని చెప్పారు. ఆసుపత్రి ఆవరణ అంతా అపరిశుభ్రంగా ఉందని పందులు తిరుగుతున్నాయని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ నాయకులు నరేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌నాయక్, సాయి, మధు, కృష్ణ, వినోద్, రాజు, జగన్, తిరుపతి, కిరణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

చైర్‌పర్సన్ అనురాధ



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

తుర్కయంజాల్: మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ అన్నారు. బుధవారం 2023–24 బడ్జెట్ సమావేశం ఆమె అధ్యక్షతన రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ ఏడాదికి గాను ఆదాయం రూ.41కోట్ల 98లక్షల 70వేల రూపాయలు ఉంటుందని ఆశిస్తున్నామని.. అంచనా వ్యయం రూ.41 కోట్ల 98 లక్షల 75 వేలుగా ఉండే అవకాశం ఉందన్నారు. హరితహారం కొరకు రూ.3 కోట్ల 28 లక్షల 92వేలు కేటాయించామని తెలిపారు. ఈ సమావేశంలో మొత్తం 39 అంశాలతో 246 పనులకు ఆమోదం తెలిపినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన ముదిగొండ పద్మమ్మ తన కూతురి పెళ్లి జరిపించడానికి నిశ్చయించింది. పెళ్లి ఖర్చులకు డబ్బులు లేక మథనపడసాగింది. స్థానిక నాయకులతో విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ తన ట్రస్టు ద్వారా పద్మమ్మ కూతురు పెళ్లికి సహాయం చేస్తానని భరోసా పలికారు. బుధవారం ట్రస్టు సభ్యులచే 100 కేజీల బియ్యంతో పాటు, నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అజీజ్, మల్లేష్, రవి, సత్యనారాయణ, అంజయ్య, గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్‌కు రూ.3వేలు అందజేత..

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన ఎర్రోల వెంకటేశ్ విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై గాయపడ్డాడు. బాధితుడిని బుధవారం జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వార్డు సభ్యులు మల్లయ్య, శ్రీను, నాయకులు రాజేశ్, భానుకిరన్, శ్రీనునాయక్, శంకర్, రవి ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

ఎంపీపీ కొప్పు సుకన్య



విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న ఎంపీపీ సుకన్య, ఉపాధ్యాయులు

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ కొప్పు సుకన్య సూచించారు. యాచారం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం హాల్‌టికెట్లు, పెన్నులు, ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పదో తరగతి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి.. పాఠశాలకు, తల్లితండ్రులకు మంచిపేరు తీసుకరావాలని సూచించారు. కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు పూర్వ విద్యార్థి పోలెశివ పరీక్ష సామగ్రిని అందజేశారు. ఉన్నత చదువులకు పది మార్కులే ప్రామాణికం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



ఆమనగల్లు: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జక్క రాంరెడ్డి ఆధ్వర్యంలో చెరువు కట్టపై ఉన్న దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతకింది చక్రపాణి, రాష్ట్ర మహిళా సెక్రటరీ ఇందిర, సింగిల్‌విండో డైరెక్టర్ అశోక్, మాజీ ఎంపీటీసీ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో బుధవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జాతీయ రహదారిపై టీడీపీ జెండాను కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ యాదీలాల్ ఆవిష్కరించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సత్యం, పర్వత్‌రెడ్డి, భాస్కర్, ఖాదర్, మల్లయ్య, పెంటయ్య, ఈదమయ్య, శ్రీనాద్, శ్రీధర్, కుమార్‌గౌడ్, శేఖర్, నరేశ్‌యాదవ్, శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.